# మూడో జన్మ

అప్పటికి సోమయాజులుగారు పచార్లు ప్రారంభించి అరగంట పైనే అయింది. చేతిలో పంచాంగం రూళ్ళకర్ర అయిపోయింది. రెండు చేతులూ వెనక్కి కట్టుకుని హాల్లో పచార్లు చేస్తున్నారాయన. ఒక గోడమీద పాత గజలక్ష్మి కాలెండరు మాసిపోయింది. మరో మూల కనీసం అయిదు సంవత్సరాల ఉత్తరాలు ఇనప తీగకు మట్టి కొట్టుకు వేలాడుతున్నాయి. ఇల్లు పాతదవడం వల్లా, పక్కనంతా కొత్త ఇళ్ళు రావడం వల్లా సోమయాజులుగారి భవంతి మరీ పాతగా కనిపిస్తూంటుంది. వంటింట్లో శారదమ్మగారు మజ్జిగ పులుసు చెయ్యడంలో నిమగ్నమై ఉన్నారు. చిన్న పిల్ల కమల స్కూలుకి వెళ్లిపోయింది. లోపల పోపు పులుసులో పడింది. ఆ శబ్దం, పరిమళం సోమయాజులుగార్ని అంటలేదు. వీధి గుమ్మం దగ్గిర నుంచుని రోడ్డుని పరకాయించి చూశాడు. పార్థు కనిపించలేదు.

చెయ్యి కొంగుతో తుడుచుకుంటూ హాల్లోకి వచ్చి శారదమ్మ అడిగింది.

''వీడు రానేలేదా ఏవిటీ?''

''ఒస్తే కనిపిస్తాడుగా''

''ఊ... సరే మీరు రండి, వడ్డిస్తాను''

''ఒక్క క్షణం ఆగలేవా! వాణ్ణి రానీ. నాకు తిండి మీద లేదు''

''వాడి సంగతెలా ఉన్నా మీరు బెంగెట్టేసుకున్నారు. అలా తిరుగుతూ గుమ్మం దగ్గిరికి వెళ్లొస్తూంటే వస్తాడా వాడు?''

పచార్లు చెయ్యడం ఆపి భార్యవేపు చూస్తూ అన్నారాయన.

''వెర్రి వెధవే. క్రితం సారి రెండ్రోజులు అన్నం తినలేదు. నాకూ అన్నం సయించలేదు. రాత్రీ పగలూ కష్టపడ్డారా. వాడికేం తక్కువ?''

''ఆ. ప్రాప్తం లేదనుకోవాలి''

''గాడిదగుడ్డు. ప్రాప్తం. వల్లకాడూను. పెద్దాడికంటే చురుకైనవాడు. చూద్దాం ఈసారి. సరే ఆ కబురేదో వినే కూచుంటాలే. వెళ్లు''

ఆమె వెళ్లిపోయింది.

సోమయాజులుగారు పచార్లు ఆపి కొయ్య కుర్చీలో కూచుని పంచాంగాన్ని పక్కనే ఉన్న టేబిలుమీద పెట్టారు పేపరు చూసి రావడానికి వెళ్లిన వెధవ, సైకిలుమీద ఇంటికి రావడానికి ఇంతసేపా. దార్లో స్నేహితులతో కాలక్షేపం కాబోసు. కుర్చీ చేతులమీదుగా రెండు చేతులూ పొట్ట మీద వేసుకుని తల వంచుకుని ఆలోచిస్తూ ఉండిపోయారు సోమయాజులుగారు. గుమ్మం దగ్గిర శబ్దం విని ఉలిక్కిపడ్డారాయన.

పార్థు సైకిలు లోపల పెడుతున్నాడు. స్టాండు వేసే లోపల సోమయాజులు గారు కుర్చీలోంచి ఓసారి లేచి కూచున్నారు. ఆయన కళ్ళు నిశితంగా, బెంగగా కొడుకు ముఖాన్ని పరిశీలిస్తున్నాయి.

నిజానికాయన కొడుకుని చూసిన క్షణంలోనే ప్రాణాలు చప్పబడిపోయాయి.

''ఊ'' అనగలిగేరాయన.

''కష్టం నాన్నా. ఈసారి పోయినట్టే''

''రాదంటావా?''

''ప్చ్. మామూలుగా అయితే వచ్చును''

పార్థు కళ్లలో సన్నటి నీటి పొర ఏర్పడ్డం గమనించక పోలేదు సోమయాజులుగారు.

''శేఖరందేవైంది?''

''వాడికి సివిల్లో రావొచ్చు''

''రమేషు?''

''వాడికీ రాలేదు. మా వాళ్లలో చంద్రానికొస్తుంది''

''మరి ఆ సుబ్బరావన్న అబ్బాయి?''

''వాడికొస్తుంది. పైగా రిజర్వేషనుంది వాడికి''

శారదమ్మగారు గుమ్మం దగ్గిర నుంచుని వింటూనే ఉంది. ఆయన కుర్చీలో తల వెనక్కి వాల్చి కళ్లు మూసుకున్నారు.

''కాళ్ళూ చేతులూ కడుక్కో. నీ కోసం కాచుక్కూచున్నారు మీ నాన్న'' భోజనం ఏర్పాట్ల కోసం లోపలికి వెళ్లిందామె. సోమయాజులుగారికి ఆకలి ఎప్పుడో పోయింది. కొడుకు కొంత ధైర్యంగా ఉంటే ఆయనకింత బెంగ ఉండకపోను. వాడికిప్పటికీ, తలనొప్పి వచ్చినా అమ్మ ఒళ్లో పడుకోవలసిందే. లుంగీ చుట్టుకుని చెవికి యజ్ఞోపవీతం వేసుకుంటూ లోపలికి వెడుతున్న పార్థుని చూడగానే సోమయాజులుగారికి కడుపులో దేవినట్టయింది. బట్టలు మార్చుకుంటూ కళ్లనీళ్లు పెట్టుకుని ఉంటాడని ఆయనకి తెలుసు.

భోజనం చేస్తున్నంత సేపూ తండ్రీ కొడుకులిద్దరూ మాట్లాడలేదు.

''మజ్జిగ''

''అదేవిరా. పులుసు వేసుగోవా?''

''ఒద్దమ్మా''

పార్థు భోజనం ముగించి లేచి వెళ్లేడు. పరిషేచనం అయినా అలాగే కూచుండి పోయారాయన. కంచం తీస్తూ అన్నదామె.

''లేవండి. చంటి పిల్లాళ్లా అలా బెంగెట్టేసుగుంటే ఎలాగూ?''

మధ్యాహ్నం కమల వచ్చి భోజనం చేసి స్కూలుకి వెళ్లిపోయింది. భోజనాల గదిలో చాపేసుకుని తల కింద పీట పెట్టుకుని కునుకు తీసింది శారదమ్మగారు. పార్థు గదిలో మంచం మీద వెల్లకిలా పడుకుని దిగులు పడుతున్నాడు. ఈసారి కచ్చితంగా ఇంజనీరింగ్‌లో సీటు వస్తుందనే ధైర్యంతో రాశాడు పరీక్షలు. రేంక్ గుప్పిట్లో నీళ్లలా ఎలా జారిపోయిందో అతనికి అర్థం కావడం లేదు. అతని ఒకళ్లిద్దరు స్నేహితులు ముడుపులు చెల్లించి బయట సీట్లు కొనుక్కోగలరు. నాన్నేం చెయ్యగలడు? అన్నయ్య అసలు లాభం లేదు. పార్థుకి భవిష్యత్తు శూన్యంగా కనిపిస్తోంది. ఇంకోసారి ఇంతకంటే బాగా చదవడం, రాయడం కుదరదు.

సోమయాజులుగారు వాలుకుర్చీలో పడుకుని ఆలోచనలో పడ్డారు. ఆయన పొట్టమీద సగం తెరిచిన దేవీ భాగవతం బోర్లా విశ్రాంతి తీసుకుంటోంది. ఆయనకి ముగ్గురు పిల్లలు. పెద్దవాడు కాలేజీలో గుమాస్తా. రెండోవాడు పార్థు. కమల అందరికంటే చిన్నది. సోమయాజులుగారు చిన్నప్పట్నించీ తండ్రి దగ్గిరే శిష్యరికం చేసి ఆయన పౌరోహిత్యం సంపాయించారు. ఊళ్లో కాస్త పెద్దవాళ్ల ఇళ్లన్నీ ఆయనవే. అంతో ఇంతో అందరికీ తెలిసిన బ్రహ్మగారాయన. సొంత ఊళ్ళో పిత్రార్జితం ఎకరం పొలం మిగిలింది. వృత్తిరీత్యా సోమయాజులుగారు పురోహితులైనా ఆయన పూర్వీకులు బాగా ఉన్నవారే. అయిదు రోజుల వివాహాలూ, సంతర్పణలూ చేసి ఆస్తిపాస్తులన్నీ నేతిజారీ కొమ్ములోంచి పరిశేషించారు. ఓ శతాబ్దం క్రితం సోమయాజులుగారి పూర్వీకుడు గొప్ప ''యజ్ఞం గూడా అఘోరించా''డని ప్రతీతి.

యాజులుగారు లోకం తెలిసిన మనిషి. బ్రాహ్మలకి, బ్రాహ్మణ్యానికీ రోజులు కావని గ్రహించి కొడుకులిద్దరినీ మామూలు చదువుల్లో పెట్టించారు. ''జంధ్యాలు వడుక్కునే రోజులు వెళ్లిపోయాయి. చదువుకుని అఘోరించ'' మని కొడుకులికి ముందే చెప్పేరాయన. పెద్దవాడు మందమతి కాకపోయినా, చదువుమీద కంటే సంపాదన మీద తాపత్రయం ఎక్కువ. మొత్తానికి కాలేజీ చదువు అయిందనిపించి తండ్రి మీద ఆధారపడ్డం మానేశాడు. పార్థు అమాయకుడు. అమ్మకూచి (''ఎలా బతుకుతాడే వీడు?'') చిన్నప్పట్నించీ

అతనికి చదువు వ్యసనం. ఇంటర్లో చేరిందగ్గిర్నించీ ఇంజనీరవ్వాలని పట్టుకున్నాడు. ("అమ్మా, నిన్ను అమెరికా తీసుకెళ్తాలేవే. రోజూ కొబ్బరి పచ్చడి వేసి పెడుదువుగాని")

సోమయాజులుగారికి పార్థుని చూస్తే గర్వం. కొడుకుని ఇంజనీరవ్వకుండా చెయ్యడం బ్రహ్మతరం కాదని ఆయన నమ్మకం. ("వెధవ పరీక్షలు. దర్భ పుల్లుచ్చుగుని రాసిపారేస్తాడే వాడు") కానీ ఇప్పటికి రెండుసార్లు పెన్నుతో రాసినా సీటు రాకపోవడం ఆయనకు మింగుడు పడ్డం లేదు. మొదటిసారి కష్టం కలిగినా తండ్రీ కొడుకులిద్దరూ త్వరలోనే సమాధానపడ్డారు. పార్థు అమ్మ ఒళ్లో, ఆయన గోదావరి గట్టున. కానీ మూడోసారి కూడా రేంక్ రాకపోవడంతో ఆయనకి పూర్తిగా ఆశ చచ్చిపోయింది. వాడి జాతకం దివ్యంగా ఉంది. ఎందుకేనా మంచిదని మందపల్లి శనీశ్వరుడికి నూనె తాగించి వచ్చేరాయన. ఇంజనీరింగ్ మాత్రం శనీశ్వరుడి పరిధిలో లేదని తేలిపోయింది... గోడమీద పాత గడియారం తీరిగ్గా నాలుగు కొట్టింది. అంటే రెండయిందన్నమాట. కళ్లజోడు మెల్లిగా ముక్కు చివరికీ, ఆయన నిద్రలోకీ జారేరు.

మెలకువొచ్చి కళ్లజోడు తీస్తుండగా గడియారం ఆరు కొట్టింది. నాలుగు. పార్థు సైకిలు బైట పెట్టుకుంటున్నాడు. ఎక్కడికని అడగలేదాయన. మొహం కడుక్కుని గ్లాసులో టీ చప్పరిస్తూ మళ్లీ ఆలోచనలో పడ్డారు సోమయాజులు గారు. కొంగుతో వేడిగ్లాసు పట్టుకుని గడప దగ్గిర కూచుంటూ అంది శారదమ్మ.

"తెలీకడుగుతాను. ఆ ఇంజనీరింగు తప్ప మరో చదువు లేదా? అందులో రాకపోతే అడుక్కుతింటారా? ఏవిటీ చోద్యం. మిరియయం గింజలాటి వాడు. ఇంకే చదువూ లేదా? వాడి మట్టుకు వాడూ, మీ మట్టుకు మీరూ ఊహూ ఇదై పోతున్నారు"

"నీ మొహం. మీ బాబు ఎప్పుడేనా అగ్రహారం దాటి ఏడిస్తేగా నీకు తెలియడానికి"

సాయంకాలం, సంచీ పుచ్చుకుని గోదావరి గట్టువేపు బయలుదేరారు సోమయాజులుగారు. మార్కండేయస్వామి గుళ్లోకి వెళ్లి గోదారిగట్టు మీద

కూచున్నారాయన. తకిలీ వడుకుతూ పక్కనే చేరేడు కృష్ణమూర్తి. బాగా పొద్దుపోయే వరకూ కృష్ణమూర్తి మాట్లాడుతూనే ఉన్నాడు. యాజులుగారు ఒక్క మాట గూడా వినలేదు.

వారం గడిచేసరికి పార్థు కాస్త కోలుకున్నాడు. అతని తోటి స్నేహితులెవరికీ రాకపోవడం కొంత ఊరట కలిగించింది. యాజులు గారింక ఆ విషయం మళ్లీ ప్రస్తావించలేదు. శారదమ్మ గారెప్పుడో మర్చిపోయింది.

ఓరోజు మధ్యాహ్నం పంచాంగం, కాయితం, పెన్సిలూ తీసుకుని లెక్కలు ప్రారంభించారు యాజులుగారు. పక్కనే చిన్న బల్లమీద తెల్ల కాయితం పుస్తకం తెరిచి ఉంది. మరోసారి పుస్తకం తీసుకుని జాగ్రత్తగా చూశారాయన. మృగశిరా నక్షత్రం. జాతక లోపం ఏవీ కనిపించడం లేదు. కాయితం మీద రెండు తేదీలు, ముహూర్తం రాశారు. పుస్తకాలు కట్టకట్టి టేబిలుమీద పెట్టి వాలు కుర్చీలో మంచి నిద్ర తీశారు యాజులుగారు.

మరో వారం గడిచింది. యాజులుగారు మాట్లాడటం తగ్గించారనీ, రాత్రీ పగలూ దీర్ఘాలోచనలో ఉన్నారనీ శారదమ్మగారు పసిగట్టలేదు. ఆ రోజు రాత్రి భోజనాలయిం తరువాత భార్యతో అన్నారాయన.

''రేపు మంచి రోజు. పనిమీద ఊరెడుతున్నాను. వెంటనే వచ్చేస్తాను''

ఆమె ఆశ్చర్యపోయింది.

''అదేవిటి? ఎల్లుండి ఏదో ఒప్పుకున్నట్టున్నారు''

''కృష్ణమూర్తి కప్పగించేను''

''ఇంతకీ ఎందుకుట?''

''ఒచ్చి చెప్తాను. ఇంకేం మాట్లాడకు''

''బావుంది''

ఆయన ముఖం పరకాయించి చూసిందావెు. కోపంగానీ, విసుగ్గానీ కనిపించలేదు. అసలాయన అక్కడ ఉన్నట్టే లేదు వాలకం.

''మీ ఇష్టం. పోనీ దార్లో ఓసారి ముక్కామల్లో దిగుతారా? చెల్లెలికి సుస్తీగా ఉందంటున్నారు''

''దిగను''

తెల్లారుతుండగానే సంచీ తీసుకుని బయలుదేరారు యాజులుగారు. ఊరెళ్లేసరికి పదిదాటి పోయింది. భోజనం చేసి విశ్రమించి, సాయంకాలం పొలం బయలుదేరారు. దార్లో వెంకటయ్యికి కబురుచేసి కాలవ గట్టున మావిడి చెట్టు కింద కూచున్నారాయన. పొలం అంతా ఖాళీగా ఉంది. దూరంగా గేదె మీద ఎక్కి మిగతా గేదెల్ని తోల్తున్నాడు పాలేరు కుర్రాడు. చీకటి పడబోతుండగా తీరిగ్గా కర్ర ఊపుకుంటూ వచ్చేడు వెంకటయ్య.

''ఎక్కడికి పోయావురా?''

''దగ్గొచ్చెత్తోందయ్యా. డాక్టర్లుగారు బిల్లలిస్తానంటే ఎల్లేను. అలగెల్లేను. మీరొచ్చేరని కవురొచ్చింది.''

''ఆయాసంగా ఉందా?''

''లేదు బావూ. దగ్గే''

కుశల ప్రశ్నలయ్యేం తరువాత కాసేపు నిశ్శబ్దంగా ఉండిపోయారు యాజులుగారు. ఎడంగా గొంతుక్కూచున్నాడు వెంకటయ్య. పొలాలమీద చీకటి దుప్పట్లు పరుచుకుంటున్నాయి. యాజులుగారికీ వెంకటయ్యకీ వయసు తేడా ఆట్టే లేదు. మూడు తరాల్నించీ వీరి పొలాలు చేస్తున్నారు వారు. అతనికీ అందొచ్చిన కొడుకోడున్నాడు. ఆడపిల్లలు ముగ్గురూ ఒదిలిపోయారు. ఒంటిమీద మాసిపోయిన తువాలు, చెవిలో చుట్టపీక. అతని నల్లటి ముఖంలో తెల్లటి గుబురు మీసాలూ, తెల్లటి కనుబొమలూ మాత్రం స్పష్టంగా కనిపిస్తున్నాయి. యాజులుగారు వాడివేపే చూస్తున్నారు. చీకటి పడ్డవే మంచిదయింది. గట్టిగా ఊపిరి పీల్చుకున్నారాయన.

''నీతో పని బడి వచ్చేన్రా''

''ఆయ''

మరోసారి గట్టిగా ఊపిరి పీల్చుకుని మాట్లాడ్డం ప్రారంభించేరు సోమయాజులుగారు. ఆయన చెప్పదలుచుకున్నదంతా చెప్పడానికి అరగంట పట్టింది. మొదట వెంకటయ్య ఏదో అనబోయాడు. తరవాత మాట్లాడ్డం అతని వల్లగాలేదు. తలమీద గునపంతో బాదినట్టయింది. గొంతు తడారి పోయింది. వెంకటయ్య గుండె కట్టు తప్పించుకుని పరుగు తీసే గేదెలా ఉంది. ఆశ్చర్యంతోపాటు వాడికి వెర్రి భయం పట్టుకుంది. యాజులుగారు వాణ్ని మాట్లాడనివ్వలేదు.

''ఈ పాపం నాదిరా. నీకేవీ నష్టం లేదు. ఒక గంట పని. నువ్వు మాట్లాడ్డానికి వీలు లేదు. చెప్పినట్టు విను. ప్రస్తుతానికి ఇంకెవరితోనూ అనకు. లే.''

వెంకటయ్య లేవలేకపోయాడు. కొన్ని శతాబ్దాల భయం వాణ్ణి ఒణికిం చేస్తోంది. మాట్లాడానికి నోరు రావడం లేదు. ఒకరి వెనుక ఒకరు పొలం గట్టు మీద ఊళ్ళోకి బయలుదేరేరు. ఆయన మనసు తేలికపడింది. వెంకటయ్యకి పీక వరకూ భూమిలో దిగబడ్డట్టయింది. ఇంటి దరిదాపులకి రాగానే యాజులుగారు వంద రూపాయల కాయితం వెంకటయ్య చేతిలో పడేస్తూ అన్నారు.

''మర్చిపోకు. ఎనిమిది ఉదయం. ఏడో గంటకి అక్కడ ఉండాలి''

మాట్లాడ్డానికి మరోసారి ప్రయత్నించాడు వెంకటయ్య. తల అడ్డంగా ఊపుతూ కళ్లనీళ్లు పెట్టుకున్నాడు. చటుక్కున యాజులుగారి కాళ్లమీద పడ్డాడు.

మర్నాడు మధ్యాహ్నం ఎప్పుడో రాజమండ్రి చేరుకున్నారు యాజులుగారు. కాళ్లూ మొహం కడుక్కుని వాలు కుర్చీలో వాలిపోయారు.

''భోంచేసి బయల్దేరారా!''

''లేదు. మీ చెల్లెలిగారింట్లో చేశాను''

''దిగనన్నారు? మందు పుచ్చుగుంటోందా?''

''ఆ''

''కాస్త చలాగ్గా ఉందా?''

''ఆ''

తరవాత ఆవిడ చెల్లెలి అనారోగ్యం గురించి మాట్లాడింది. ఆయన అప్పటికెప్పుడో కునుకు తీశాడు.

నాలుగు రోజులైంది. యాజులుగారు ఇంట్లో ఎవరితోనూ మాట్లాడ్డం మానేశారు. భార్య అడిగినా ముభావంగా సమాధానం చెప్పి ఊరుకుంటున్నారు. మర్నాడు ఎనిమిదో తారీకు అనగా ఆయన రాత్రి ఇంటికి ఆలస్యంగా వచ్చేరు. రిక్షాలో దిగి, లోపలికి రెండు మూటలతో సంబారాలు తీసుకొచ్చేరు.

''ఏవిటండీ ఇవి?''

''కావాల్లే''

రాత్రి పడుకోబోతుండగా భార్యనీ, కొడుకునీ పిలిచేరు సోమయాజులు గారు. కమల చాపమీద కామాలా పడుకుని నిద్రపోతోంది. యాజులుగారి తెల్ల ముఖం మీద చెమటల పొర కప్పింది. సూటిగా కొడుకువేపు చూస్తూ అడిగేరాయన.

''పార్థా! నీకు నిజంగా ఇంజనీరింగు అవాలని ఉందా?''

అతని కేవనాలో తోచలేదు.

''నీకు ఈసారి సీటు వచ్చి తీరుతుంది. గవర్నమెంటు దగ్గిర్నుంచి ఎల్లుండి కాయితం తెస్తాను. నేను చెప్పినట్టు చెయ్యి. ఉదయమే లేచి అమ్మచేత తలంటించుకో, కొత్త పంచ తెచ్చేను. కట్టుకో...''

''ఏవిటీ ఇదంతా? వారం నుంచి చూస్తున్నాను మీ వాలకం''

''మాట్లాడకుండా నే చెప్పేది వినండి. శతకోటి దరిద్రాలకి అనంతకోటి

ఉపాయాలు...'' అని మరో అరగంట మాట్లాడేరు యాజులుగారు. పార్థుకి తల గిరగిరా తిరిగింది. కళ్ళు బైర్లు కమ్మేయి. శారదమ్మగారు ఏడుపు ప్రారంభించింది. భర్త కాళ్లమీద పడింది. చలించలేదాయన.

''ఇదేం పాపకర్మం. ఎక్కడేనా ఉందా?''

''శాస్త్రాల్లో ఉంది''

మళ్లీ ఏడుపు ప్రారంభించిందామె.

''ఇంక చాలు. వాడికేవీ నష్టం లేదు. మనకేవీ నష్టం లేదు. అన్నీ ఆలోచించేను. నేనింకా బతికే వున్నాను. ఏడుపు ఆపు''

ఆ రాత్రి ఆవెు నిద్రపోలేదు. కళ్లనీళ్లు ఆగలేదు. మధ్యరాత్రి లేచి యాజులుగార్ని లేపి, తెల్లారే లోగా గోదాట్లో దూకుతానందామె. నిద్ర కళ్ళతో ఆమెనొకసారి చూసి, పక్కకి తిరిగి పడుకున్నా రాయన.

మార్కండేయస్వామి గుడి ఎదురుగా ఉదయవే గట్టుమీద ఒణికిపోతూ నుంచున్నాడు వెంకటయ్య. సూర్యుడివేపు తిరిగి వెయ్యోసారి దణ్ణం పెట్టుకుని కొత్త ధోవతితో కళ్లు తుడుచుకున్నాడు. రోడ్డుమీద యాజులుగారు కనిపించారు. దగ్గరికి రాగానే మళ్లీ కాళ్లమీద పడ్డాడు వెంకటయ్య.

''చెప్పేగదా. నీకు మిగతా గొడవలతో సంబంధం లేదు. రా... ఇప్పటికిప్పుడే ఇంట్లో వుండాలి. నడు. మధ్యాన్నం బస్సుకి ఇంటికే పోదువుగాని''

యాజులుగారు ముందు నడుస్తుంటే అతి కష్టంమీద వెంకటయ్య అనుసరించాడు. దార్లో కళ్ళు ఒత్తుకుంటూనే ఉన్నాడు.

పెరటి తలుపు తీశారు యాజులుగారు. చలేసినట్టయింది వెంకటయ్యకి. గట్టిగా కళ్ళు మూసుకుని బాదం చెట్టు కిందికి వచ్చేడు. మరో క్షణంలో యాజులుగారి కుటుంబం వంటింటి గుమ్మంలోంచి వచ్చింది. శారదమ్మగార్ని చూడగానే వెంకటయ్యకి పెద్దగా ఏడుపొచ్చింది. దణ్ణం పెట్టి ఏడుస్తూ నుంచున్నాడు.

ఆ ఉదయం, ఎనిమిదీ నలభై ఆరు నిమిషాలకి మల్లిసాల పెద్ద అంజయ్య కొడుకు మల్లిసాల వెంకటయ్య, గుంటూరి సదాశివశాస్త్రిగారి రెండో కుమారుడైన గుంటూరి సోమయాజులుగారి రెండో కుమారుడు పార్థసారథిని, భారత ప్రభుత్వ చట్టానికీ, శాస్త్రానికీ ఇబ్బంది లేకుండా - దత్తత స్వీకారం చేశాడు.

రచన సచిత్ర మాసపత్రిక

*